# ఒకటో తరగతి వాచకం కథ

– నాగభైరవ పద్మజా చౌదరి




ట్రెజరీ నుంచి పెన్షన్ డబ్బు తీసుకొని లెక్కబెట్టుకొని ఇంటికి బయలుదేరాడు వెంకటపతి. ఇంటికి వెళ్లాలనిపించలేదు. ఇటీవలనే అక్షరాభ్యాసం జరిగిన తన మనుమరాలు 'రత్న' పాపకోసం ఇవాళ ఒకటో తరగతి పుస్తకం కొనాలని నిర్ణయించుకొన్నాడు. ఆ మాటే ఇంట్లో కోడలికీ, ఇంటి సంగతి పట్టించుకోకుండా తిరిగే కొడుక్కీ చెప్పి వచ్చాడు. ఇవాళ ఎలాగైనా తన ముద్దుల మనుమరాలు కోసం ఒకటో తరగతి వాచకం కొన్నదాక ఇంటికి వెళ్లగూడదు. ఆ పుస్తకం కొనుక్కెళ్లి – ఆ సిసింద్రీని ఒళ్లో కూచోబెట్టుకుని అరక – ఆవు – ఇటుక – ఈగ పదాలు చెప్పి పలికిస్తుంటే ఎంత ఆనందంగా వుంటుందో! ఊహించుకుని మురిసిపోతూ ముందుకు సాగాడు వెంకటపతి.

కలెక్టరు బంగళాదాటి ఇటు కుడివేపు తిరిగితే ట్రంకురోడ్డు. ఆ రోడ్డులో నాలుగైదు పుస్తకాల షాపులున్నాయి. ఒక షాపులోకి అడుగుపెట్టేసరికి కౌంటర్ ముందు బెల్లంచుట్టూ ఈగల్లాగ పిల్లలు పుస్తకాలకోసం ముసురుకొని వున్నారు. వాళ్లవెనగ్గా తమా నిలబడి "ఒకటో తరగతి వాచకం కావాలి నాకు" అన్నాడు పెద్దగా గుమస్తాతో. అక్కడ ముసిరివున్న పిల్లలంతా ఆశ్చర్యంగా కళ్లు పెద్దవి చేసి వెంకటపతివేపు చూశారు. 'ఇంత ముసలాయన ఒకటో తరగతి చదువుతున్నాడా!' అని కాబోలు వాళ్ల ఆశ్చర్యం! వాళ్లు అడక్కుండానే తాను అన్నాడు "మా మనుమరాలు రత్న ఒకటో తరగతి చదువుతోంది"– అప్పటికి వాళ్లు తృప్తిగా నిట్టూర్పులు విడిచినట్టున్నారు.

షాపు గుమాస్తా అన్నాడు "చూడండి తాతయ్యగారూ! ఇక్కడ ఒకటో తరగతి వాచకం

5–8–94 ఆంధ్రజ్యోతి వారపత్రిక

వుండదు. ఆ వాచకాలూ గట్రా ప్రభుత్వమే ముద్రిస్తుంది. వాళ్ళు సూపర్‌బజార్ల ద్వారా అమ్ముతారు. మేమంతా అమ్మేది గైడులూ నోట్‌బుక్కూ మాత్రమే! కావాలంటే చెప్పండి. ఒకటో తరగతికి గైడు వుంది ఇస్తాము."

"ఒకటో తరగతికి గయుడా? అంబరీషుడు లేడా?" అంటూ వెంకటపతి తనేసిన జోక్‌కి తనే నవ్వుకుంటూ సూపర్‌బజారుకు చేరాడు.

అక్కడ పుస్తకాల కౌంటర్‌లో గుమాస్తా అమ్మాయి "పుస్తకాలయితే వున్నాయండి. అయితే మీరు జిల్లా విద్యాశాఖాధికారి (డిఇఓ)గారి నుండి పర్మిషన్ లెటర్ తెస్తేనే ఇస్తాం. అవీ మా రూల్సు" అంది.

'ఓరి! వీడి దుంపతెగ! గవర్నమెంటు వాడూ! మన డబ్బుతో మనం పుస్తకం కొనాలంటే పర్మిషన్ ఎందుకో!' ఈ పద్ధతి ఏమిటో వెంకటపతికి అర్థం కాలేదు.

అయినా డిఇఓ ఆఫీసుకెళ్ళాడు. గంట తర్వాతగానీ అయ్యగార్ని కలవడానికి అవకాశం దొరకలేదు. కలిశాక ఆయన చాలా తాపీగా మాట్లాడాడు. ఒక అప్లికేషన్ రాయించుకొన్నాడు. దానిమీద ఏదో పచ్చసిరాతో రాశాడు. "ఈ కాగితం పట్టుకెళ్లి మండల విద్యాశాఖాధికారికి ఇవ్వండి. అతడు పర్మిషన్ ఇస్తాడు. దానితో మీ మనుమరాలికి వాచకం కొనుక్కోవచ్చు. అదేమంత బ్రహ్మవిద్య!! వెళ్లిరండి. విష్ యు బెస్ట్ ఆఫ్ లక్" అన్నాడు డిఇఓ.

'వీడి బొంద లక్కు! ఒకటో తరగతి వాచకానికి ఇంత తతంగమా!' అని తిట్టుకుంటూ బయటపడి, సిటీబస్సు ఎక్కి మండల ఆఫీసుకు వెళ్లాడు వెంకటపతి.

ఆ ఎం.ఆర్.ఓ.గారు ఫైళ్లలోంచి తలెత్తి తనవేపు చూసేసరికి అరగంటపైన పట్టింది. విషయం చెప్పగానే, "నేను బిజీగా వున్నాను. అయినా ఆ స్కూలు హెడ్మాష్టరును విచారించాలి. మీ పిల్ల ఆ స్కూల్లో నిజంగా చదువుతోందో లేదో తెలుసుకోవాలి. ఇదంతా ప్రొసీజర్. రేపు రండి" అంటూ ఫైళ్లలో తల పాతిపెట్టుకున్నాడు.

వెంకటపతికి ఏం చెయ్యాలో తెలియలేదు. బయటికి వచ్చాడు. "ఛూ! పాడు దేశం! అందర్నీ చదువుకోమంటుంది! పుస్తకాలకోసం ఇంత తతంగమెందుకో" అనుకున్నాడు.

ఇంతలో ఓ పాతికేళ్ల కుర్రాడు ఎదురువచ్చి విష్‌చేసి "ఓ అయిదు ఇలా పడెయ్యండి. ఐదు నిముషాల్లో మీకు కావలసిన సర్టిఫికెట్ తెస్తాను" అన్నాడు. అతడు అక్కడ అటెండరు. వెంకటపతి ఆశ్చర్యం నుండి తేరుకోకుండానే అతని చేతిలో ఐదు నోటు వుంచాడు. వాడు నాలుగు నిమిషాల్లో సదరు పర్మిషన్ కాగితం వెంకటపతి చేతిలో పెట్టాడు.

ఈ దేశంలో పరిస్థితులు ఇంత సులభంగా మారాయా? అని గోరంత బాధ, పిసరంత విషాదం అనుభవించిన వెంకటపతి ఎలాగైనా పుస్తకం సంపాదించబోతున్నానే విజయ గర్వంతో సిటీబస్ ఎక్కి సూపర్‌బజార్ దగ్గర దిగాడు.

సూపర్‌బజార్ గేటు పక్క ఫుట్‌పాత్ మీద అమ్మే పాత పుస్తకాల మీద అతడి దృష్టి పడింది. అదిగో! తెలుగుభారతి-1. ఒకటో తరగతి వాచకం. ఇద్దరు పిల్లలు చదువుతున్న బాపూగారి బొమ్మ ముఖచిత్రంతో- అది పాతదెందుకవుతుంది? కొత్తది. ఇంకా ఎవరూ తాకనిది! తెరవనిది. గబుక్కున వంగి దబుక్కున ఆ పుస్తకాన్ని అందుకున్నాడు వెంకటపతి. దాని వెల రూ. 3/- అయినా, ఐదిచ్చేశాడు ఆనందంగా. తన తపస్సుకు మెచ్చి రంభ ప్రత్యక్షమైన మునీశ్వరుడి ఆనందానికి ఆనంత తగ్గదు వెంకటపతి ఆనందం.


అట్ట తెరిచి చూశాడు. 'ఇది అమ్మకానికి కాదు - ఉచిత పంపిణీకి' అని రబ్బరు ముద్రవేసి వుంది ఇన్నర్ టైటిల్ పేజీలో. అంతేకాదు 'డి.ఇ.ఓ.గారి టేబుల్ కాపీ' అని సిరాతో రాసి వుంది.

ఎవరొచ్చి దీన్ని లాక్కుపోతారో అన్న భయంతో గబగబ అంగలు వేసుకొంటూ సాగాడు వెంకటపతి. తన మనుమరాలు రత్నాని ఒళ్లో కూచోబెట్టుకొని 'అరక ... ఆవు ... ఇటిక ... ఈగ' తను చెబుతూ ఆమెచే పలికించాలనే ఆతృత ఒక్కటే అతనికుంది.

దేశం ఏమయితే వెంకటపతికేం? ఆ సంగతి చూసుకోడానికి రాజకీయ నాయకులున్నారుగా!

నీతి: దొడ్డిదారి తలుపు తీసియున్నప్పుడు రాచవీధిని నడువకూడదు! ◆

వియ్యపురాలిని అడిగింది విశాలాక్షి-
"నీ కన్నకూతురిలా చూసుకుంటానని చెప్పి నా కూతురిని కొడుతున్నావేం వదినా?"
"నా కూతుర్ని కూడా కొడలాగా... అందుకనీ..."
—దుర్గాశేఖర్




# బాబా చెప్పిన కథలు



## ◆ ఖచ్చితంగా వుంటాడు ◆

జ్ఞానబ్రహ్మ శ్రీశ్రీ సుందరచైతన్యానందస్వామి రాజమండ్రి ధవళేశ్వరం వద్ద ఆశ్రమం నిర్మించి జ్ఞాన బోధ చేస్తూ వుంటారు.

వారు రాష్ట్రమంతా తిరుగుతూ జ్ఞాన యజ్ఞాలు నిర్వహిస్తూ వుంటారు. ఇప్పటికి అలాంటి యజ్ఞాలు 117 వరకు పూర్తి చేశారు.

ఆ 117వ యజ్ఞం సందర్భంగా విజయవాడలో ఇటీవల చెప్పిన ఓ విషయాన్ని తెలుసుకుందాం.

ఓ భక్తుడు ఆయన వద్దకు వచ్చి "స్వామీ! నేను ఓ పెద్ద ఇంటిని కట్టుకున్నాను. దాని గృహ ప్రవేశం మీ చేతుల మీదుగా జరగాలని వుంది. తప్పక రావలసింది" అని ఆయన్ను ఆహ్వానించాడు. భక్తుని కోరికపై ఆ యింటిని శ్రీ సుందరచైతన్యానందస్వామి దర్శించారు.

అది మూడంతస్తుల భవనం. చాలా విశాలమైన గదులతో సర్వాంగ సుందరంగా వుంది. యజమాని ఇల్లంతా స్వయంగా స్వామీజీకి చూపించాడు. ప్రతి గదిని పేరు పేరున ఎవరి కోసం కేటాయించిందీ చూపుతూ "ఇది మా పెద్దబ్బాయిది, ఇది మా చిన్నమ్మాయిది" అంటూ చెప్పసాగాడు.

అంతా చూచిన శ్రీ సుందరచైతన్యానందకి మాత్రం తృప్తి కలగలేదు. చివరికి భక్తుని పిలచి అడగనే అడిగారాయన.

"ఏమయ్యా! అంతా బాగానే వుంది, అన్నీ చూపించావు. ఇంతకీ దేముని గది మాత్రం నాకు చూపించలేదేమిటి?" అంటూ ప్రశ్నించారు.

అప్పుడా భక్తుడు "అదేమిటి స్వామి మీరు చూడలేదా? ఇలా రండి!" అంటూ తిరిగి వంటింటిలోకి తీసుకెళ్ళాడు. అక్కడ అనేక గిన్నెలు, దొన్నెల క్రింద ఓ అలమారలోని క్రింది గూడును చూపించి "ఇదిగో ఇక్కడ భగవంతుని ఏర్పాటు చేశాను" అన్నాడు. "అదేమిటి? ఇక్కడా?" అంటూ స్వామి ఆశ్చర్యపోయారు. అప్పుడా యజమాని "అవును స్వామి. అక్కడయితే మా ఆవిడకు ఎంతో..." అంటూ ఏదో చెప్పబోయాడు. వెంటనే చైతన్యానంద స్వామి "ఇక నాకు ఏమీ చెప్పనవసరం లేదు. నాకు అంతా అర్థం అయింది. నీకు ఇంత సంపదనిచ్చి, ఇంత వైభవాన్ని కలిగించిన ఆ భగవంతునికి నీవు ఇచ్చిన గౌరవం ఇదటయ్యా! వేరే ప్రదేశమే నీకు కనిపించలేదా? అయినా ఆయనకు ఓ గదిని ఏర్పాటు చేయలేక పోయావు" అంటూ ఎంతో వాపోయారు. అలా అక్కడనుంచి తిరిగి వచ్చేశారట స్వామీజీ.

ఈ సందర్భాన్ని పురస్కరించుకుని శ్రీ సత్యసాయి భక్తుని విషయం ఒకటి చెప్పకుందాం! 'వేటపాలెంలాంటి ఓ వూరిలో సాయి భక్తుడు ఒకరు వున్నారు. ఆ కుటుంబం అంతా చేనేత కార్మికులు, అనేక ఈతి బాధలు, సమస్యలతో నిండి వుంటుంది వారి జీవితం. నివసించేది ఒకే గదిగల ఇల్లు. దానికి చిన్న వరండా. అయినా ఆ కుటుంబం అంతా వరండాలో నివశిస్తూ ఆ గదిని మాత్రం దేవుని గదిగా వుంచి, ఎంతోకాలంగా భక్తితో కొలుస్తూ జీవిస్తున్నారు. ఈ మధ్య ఆ గదిలో భగవంతుని పటం నుంచి విభూతి రాలటం, కొన్ని పాద ముద్రలు కనిపించటం లాంటివి జరిగాయి. కొంతమంది జిజ్ఞాసతో వెళ్ళి వాటిని పరీక్షించి ఫోటోలు తీయడం కూడా జరిగింది. నిజానిజాలను అలా వుంచి ఈ విషయాన్ని మనం పైన చెప్పిన సుందర చైతన్యానంద విషయంతో పోల్చుకున్నట్లయితే ఎందుకు అలా జరగదు? ఖచ్చితంగా జరిగి తీరుతుంది. అని రూఢిగా అనిపిస్తుంది. తనకు వున్నా లేకపోయినా వున్న ఒక్క గదిని భగవంతునికి సమర్పించిన భక్తుని వద్ద భగవంతుడు వుండడా? ఖచ్చితంగా వుంటాడు' అని సమాధానం మనకు దొరుకుతుంది. ●



5-8-94 ఆంధ్రజ్యోతి సచిత్ర వారపత్రిక